ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ

అన్ని నియోజకవర్గాలలో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను

ఫోన్ నెం. 99517 75293

VIGNAN PATRIKA

APTEL/2024/89102

# విజ్ఞాన్ పత్రిక


తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

సంపుటి : 02 సంచిక : 66 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి సోమవారం 06 ఏప్రిల్ 2026 పేజీలు : 04 వెల : 02


# ప్రజా ఉద్యమంగా నీటి భద్రత

- జలవనరుల సంరక్షణకు 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ
- భూగర్భ జలమట్టాన్ని కనీసం 1.5 మీటర్లు పెంచడమే లక్ష్యం
- నీటి సంరక్షణపై 100 రోజుల ప్రణాళిక
- నేటి నుంచి జూలై 14 దాకా కార్యక్రమం
- సాగునీటి సంఘాలకు బాధ్యతలు
- ప్రజల భాగస్వామ్యంతో నిర్వహణ
- టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు దిశానిర్దేశం
- నీటి సంరక్షణ బాధ్యత అందరిదీ
- తద్వారా రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి
- భూగర్భ జలాలు పెంచాలని సూచన
- నేడు అనంతపురం జిల్లాలో సీఎం పర్యటన

ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. నీటి భద్రతతోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందని అన్నారు. జల సంరక్షణ ప్రధాన అజెండాగా రాష్ట్రవ్యాప్తంగా 100 రోజుల కార్యక్రమాలను చేపట్టాలని సాగునీటి సంఘాలకు దిశానిర్దేశం చేశారు. దీనిని సోమవారం నుంచి జూలై 14వ తేదీ వరకూ సామాజిక ఉద్యమంలా నిర్వహించేలా కార్యాచరణ ప్రణాళిక ప్రకటించారు. ఆదివారం సాగునీటి వినియోగదారుల సంఘాలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 60,000 మంది సభ్యులకు బాధ్యతలు అప్పగించారు. జలవనరులు, అటవీ, పంచాయతీరాజ్, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా సాగునీటి సంఘాలకు సీఎం పలు సూచనలు చేశారు. సోమవారం నుంచి ఈ నెల 15వ తేదీ దాకా సాగునీటి భద్రతా కార్యక్రమాలను గుర్తించాలన్నారు. గుర్తించిన పనులకు16 నుంచి 20వ తేదీ వరకు పాలనామోదం పొందాలన్నారు. 21 నుంచి జూలై 9వ తేదీ దాకా పనులు చేపట్టాలని ఆదేశించారు. జూలై 10 నుంచి 14వ తేదీ దాకా పనుల వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని సూచించారు. ఈ వంద రోజుల కార్యక్రమం అనంతరం వర్షాకాలం ప్రారంభమవుతుందని వివరించారు. ప్రస్తుతం రిజర్వాయర్లలో గతంలో కంటే నీళ్లు పుష్కలంగా ఉన్నాయని, భూగర్భ జలాలు పెరిగాయని వెల్లడించారు. నీటి భద్రత ఇవ్వగలిగితే రాష్ట్రమంతా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు.



# ఈళవ ఓట్లే కీలకం

- 53 అసెంబ్లీ స్థానాల్లో నిర్ణాయకం
- ఆ ఓటు బ్యాంకుపై బీజేపీ కన్ను
- కేరళలో ఆసక్తికర సమీకరణాలు
- ఈళవల ప్రాబల్యం
- ఓట్ల కోసం పాట్లు
- ఓటింగ్ సరళిలో మార్పులిలా




# భయానికి, భరోసాకు పోరు

- పశ్చిమ బెంగాల్‌లో మహా జంగిల్‌రాజ్: మోదీ
- చొరబాటుదార్లను ఓటు బ్యాంకుగా మార్చుకున్న సీఎం మమత
- మేము అధికారంలోకి రాగానే వారిని బయటకు పంపిస్తాం
- బెంగాలీలు తలెత్తుకొని జీవించేలా చేస్తామన్న ప్రధాని
- గూండాల బెదిరింపులను లెక్కచేయొద్దు



# అమెరికాకు మరో ఎదురు దెబ్బ

- రెస్క్యూ విమానాన్ని కూల్చేసిన ఇరాన్..ఐదుగురు మృతి
- దిగిరాకుంటే నరకమే : ట్రంప్ అల్టిమేటం
- పట్టించుకోని టెహ్రాన్
- గల్ఫ్‌పై కొనసాగుతున్న దాడులు
- పైలట్‌ను రక్షించాం : ట్రంప్
- ఇరాన్ సీనియర్ అధికారులను చంపేశాం
- కువైట్ చమురు సెక్టార్ కాంప్లెక్స్‌పై ఇరాన్ దాడి
- నరక ద్వారాలు మీ కోసమే తెరిచి ఉన్నాయి : ఇరాన్ హెచ్చరిక
- అణు స్థావరాలపై దాడులను ఖండించండి : ఐరాసను కోరిన ఇరాన్
- లాభాలు దండుకుంటున్న ఇంధన కంపెనీలపై పన్నులు: ఈయూ దేశాల ఆర్థిక మంత్రుల సూచన
- లెబనాన్‌లో 17 ఐరాస కెమేరాలు ధ్వంసం



ఇరాన్‌పై సాగిస్తున్న యుద్ధంలో అమెరికా దళాలకు మరో ఎదురు దెబ్బ తగిలింది. అమెరికాకు చెందిన ఎఫ్-15ఈ యుద్ధ విమానాన్ని ఇరాన్ కూల్చేయడం, దానిలో ఉన్న ఇద్దరు పైలట్లలో ఒకరు గల్లంతైన విషయం తెలిసిందే. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టిన రెస్క్యూ విమానాన్ని కూడా కూల్చేశామని ఇరాన్ రివల్యూషనరీ గార్డులు ప్రకటించారు. పైలట్‌ను రక్షించామంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటన చేసిన తర్వాత ఇరాన్ మీడియా ఓ వార్తను అందించింది. దాని ప్రకారం...కూలిపోయిన యుద్ధ విమానానికి చెందిన పైలట్ కోసం గాలింపు జరుపుతున్న అమెరికా రెస్క్యూ విమానం సీ-130ని ఇస్ఫహాన్ దక్షిణ ప్రాంతంలో ఐఆర్‌జీసీ ధ్వంసం చేసింది. ఖతార్ మీడియా కూడా ఈ విషయాన్ని ధృవీకరించింది. గాలింపు చర్యలు చేపట్టిన విమానాలకు రీఫ్యూయలింగ్ చేయడానికి సీ-130 వచ్చింది. అయితే అందులోని సిబ్బంది ఏమైందీ తెలియలేదు. గాలింపు సమయంలో ఇరాన్ దళాలు అనేక అమెరికా విమానాలను ధ్వంసం చేశాయి. ఈ సందర్భంగా ఇరాన్ దళాలు జరిపిన దాడులలో ఐదుగురు చనిపోయారు. కూల్చివేతకు గురైన వాటిలో సీ-130 విమానంతో పాటు రెండు బ్లాక్‌హాక్ హెలికాప్టర్లు కూడా ఉన్నాయి.

**పైలట్‌ను రక్షించాం : ట్రంప్**

ఇరాన్‌లో చిక్కుపోయిన రెండో పైలట్‌ను రక్షించామని, ఇది అమెరికా చరిత్రలోనే అత్యంత సాహసోపేతమైన ఆపరేషన్ అని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఇరాన్‌లోని ప్రమాదకరమైన పర్వతాల్లో అతనిని గుర్తించారని, ప్రస్తు తం అతను అమెరికా బలగాల రక్షణలో ఉన్నాడని తెలిపా రు. పైలట్‌ను తీసుకొని రావడానికి ప్రపంచంలోనే అత్యం త ప్రాణాంతక ఆయుధాలతో అనేక విమానాలను పంపా మన్నారు. పైలట్ గాయపడినప్పటికీ కోలుకుంటున్నాడని చెప్పారు.

# రాజ్యాంగం సజీవం

- న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థల ఒకే లక్ష్యంతో అది సాధ్యం
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్
- నూతన హైకోర్టు జోన్--2 భవన నిర్మాణ పనులకు సీజేఐ భూమిపూజ
- ఈ కార్యక్రమం లాంఛనం కాదు.. రాజ్యాంగ విధి
- కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు సమాంతరంగా సాగడం సరైనదే
- తెలంగాణ వచ్చాక దశాబ్ద కలకు కార్యరూపం ఈ భవన నిర్మాణం
- రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని అభినందించిన సీజేఐ
- అన్ని మతాల ప్రజల దేవాలయం ఈ న్యాయాలయం: సీఎం రేవంత్
- కొత్త హైకోర్టు నిర్మాణం ప్రభుత్వానికి గౌరవప్రదమని వెల్లడి



- పాల్గొన్న సుప్రీం న్యాయమూర్తులు, హైకోర్టు సీజే జస్టిస్ ఏకే సింగ్

రాజ్యాంగం సజీవంగా ఉండాలంటే న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు ఒకే లక్ష్యంతో పనిచేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో నిర్మించే నూతన హైకోర్టు జోన్--2 భవన నిర్మాణ పనులకు ఆదివారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేశారు.

# 'స్టార్టప్ స్టేట్' తెలంగాణ

- తెలంగాణ ప్రస్థానం అంటే ఆత్మగౌరవం, ఆకాంక్ష, పురోగతికి నిదర్శనం
- బీఆర్‌ఎస్ హయాంలోనే దిగ్గజ సంస్థలకు హైదరాబాద్ చిరునామాగా మారింది
- ఏఐ, లైఫ్ సైన్సెస్, ఫిన్‌టెక్, అగ్రిటెక్ సమ్మేళనంతోనే వృద్ధి
- కొలంబియా బిజినెస్ స్కూల్ 21వ వార్షిక ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్‌లో కేటీఆర్
- రాష్ట్రాలే దేశాభివృద్ధికి ఇంజన్లు.. దీన్ని కేంద్రం గుర్తించాలి..
- ప్రపంచ వ్యాక్సిన్ రాజధానిగా తెలంగాణ..!




భారతదేశంలో అత్యంత విజయవంతమైన 'స్టార్టప్ స్టేట్'తెలంగాణ అని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు అన్నారు. తెలంగాణ ప్రస్థానం అంటే ఆత్మగౌరవం, ఆకాంక్ష, పురోగతికి నిదర్శనమని చెప్పారు. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ప్రతిష్టాత్మక కొలంబియా బిజినెస్ స్కూల్‌లో జరిగిన 21వ వార్షిక ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్‌లో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

# అమెరికాకు మరో ఎదురు దెబ్బ

**ఇరాన్ సీనియర్ అధికారులను చంపేశాం**

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై జరిపిన దాడులలో ఆ దేశానికి చెందిన పలువురు సీనియర్ సైనికాధికారులు చనిపోయారని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. దాడికి సంబంధించి ఒక నిమిషం ఏడు సెకన్ల నిడివి కలిగిన వీడియోను కూడా ఆయన షేర్ చేశారు. అందులో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. ఆకాశంలో దట్టమైన పొగలు అలము కున్నాయి. అయితే ఈ దాడులు ఎప్పుడు జరిగిందీ ట్రంప్ వెల్లడించలేదు. తమతో ఒప్పందం చేసుకొని, హర్మూజ్ జలసంధిని తెరవని పక్షంలో నరకాన్ని చవిచూడాల్సి ఉంటుందంటూ హెచ్చరిక జారీ చేసిన తర్వాత ట్రంప్ ఈ వీడియోను విడుదల చేయడం గమనార్హం. ఇరాన్ కూడా ఈ దాడులపై ఇంతవరకూ స్పందించలేదు. ఇదిలావుండగా యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన ఇరాన్ కమాండర్ ఖస్సెమ్ సోలైమని బంధువుగా గుర్తించిన ఓ మహిళ శాశ్వత నివాస హోదాను అమెరికా రద్దు చేసింది. సొలైమని బంధువు హమిదెహ్ సొలైమని అఫ్షర్‌ను, ఆమె కుమార్తెను ఇమ్మిగ్రేషన్ అధికారులు నిర్బంధించారని, వారిని దేశం నుంచి బయటికి పంపే ప్రయత్నం జరుగుతోందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో చెప్పారు.

**కువైట్ చమురు సెక్టార్ కాంప్లెక్స్‌పై ఇరాన్ దాడి**

గల్ఫ్‌లోని కువైట్‌పై ఇరాన్ ఆదివారం విరుచుకు పడింది. షువైఖ్ చమురు సెక్టార్ ప్రాంగణంపై డ్రోన్ దాడి జరిపింది. దీంతో అక్కడ పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ కాంప్లెక్స్‌లో చమురు మంత్రిత్వ శాఖ కార్యాలయం, కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఉన్నాయి. దాడిలో ఆస్తినష్టం గణనీయంగానే జరిగిందని తెలుస్తోంది. విద్యుత్–డీశాలినేషన్ ప్లాంట్లను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ డ్రోన్లను ప్రయోగించగా రెండు విద్యుదుత్పత్తి యూనిట్లలో కార్యకలాపాలు నిలిచి పోయాయి. ఇరాన్ వైపు నుంచి దూసుకొచ్చిన క్షిపణులు, డ్రోన్లను తమ రక్షణ వ్యవస్థలు సమర్ధవంతంగా అడ్డుకున్నాయని కువైట్ తెలిపింది. ఈ కారణంగా భారీగా పేలుడు శబ్దాలు వినిపించాయని చెప్పింది. కువైట్‌లోని ఓ ప్రభుత్వ భవనంపై కూడా డ్రోన్ దాడి జరిగిందని తెలుస్తోంది. కాగా ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లను అడ్డుకునే క్రమంలో శకలాలు భూమిపై పడి అబుధాబీలోని బోరగ్ పెట్రోకెమికల్ ప్లాంటులో పలు దఫాలుగా మంటలు చెలరేగాయి. ఈ ఘటన నేపథ్యంలో ప్లాంటులో కార్యకలాపాలను వెంటనే నిలిపివేశారు. అటు యూఏఈలోని అల్యూమినియం పరిశ్రమ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని క్షిపణులు, డ్రోన్లతో ఇరాన్ దాడులు జరిపింది.

**నరక ద్వారాలు మీ కోసమే తెరిచి ఉన్నాయి : ఇరాన్ హెచ్చరిక**

తమతో ఒప్పందానికి రావాలని, హర్మూజ్ జలసంధిని తెరవాలని, లేకుంటే నరకం చూస్తారని ట్రంప్ జారీ చేసిన హెచ్చరికలను ఇరాన్ బేఖాతరు చేసింది. ట్రంప్ జారీ చేసిన అల్టిమేటంను తోసిపుచ్చింది. అది నిస్సహాయతతో, భయాందోళనలతో జారీ చేసిన హెచ్చరిక అని ఎద్దేవా చేసింది. 'అందులో పొంతన లేదు. ఆయనది తెలివితక్కువ చర్య. మేము ఇస్తున్న సందేశం యొక్క అర్థమేమిటంటే నరక ద్వారాలు మీ కోసం తెరిచి ఉంటాయి' అని ఖతం అల్–అన్బియా కేంద్ర కార్యాలయానికి చెందిన జనరల్ అలీ అబ్దోల్లహీ అలియాబది హెచ్చరించారు.

**అణు స్థావరాలపై దాడులను ఖండించండి : ఐరాసను కోరిన ఇరాన్**

తమ అణు స్థావరాలపై అమెరికా–ఇజ్రాయిల్ దళాలు జరుపుతున్న దాడులను ఖండించాల్సిందిగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్‌ను కోరారు. ఈ మేరకు గుటెర్రెస్‌కు రాసిన లేఖను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఇరాన్‌లో పనిచేస్తున్న ఏకైక అణు విద్యుత్ ప్లాంటుపై పదే పదే జరుగుతున్న దాడులు మధ్యప్రాచ్యంలో మానవ, పర్యావరణ ప్రమాదాలకు దారితీస్తాయని అరాగ్చీ హెచ్చరించారు. బుషెహర్ స్థావరంపై జరుగుతున్న దాడులను సహించలేని పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. రేడియో ధార్మిక పదార్థాలు కలుషితమైతే ఇరాన్ సరిహద్దులకు ఆవల కూడా తీవ్ర పరిణామాలు తప్పవని ఆందోళన వ్యక్తం చేశారు. బుషెహర్ ప్లాంటుపై నాలుగు సార్లు దాడి జరిగిందని సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్ ద్వారా ఆయన తెలియజేశారు. రేడియో ధార్మిక పదార్థాలు విడుదలైన పక్షంలో టెహ్రాన్ కంటే గల్ఫ్ సహకార మండలి సభ్య దేశాలకే ముప్పు ఎక్కువ అని చెప్పారు.

**లాభాలు దండుకుంటున్న ఇంధన కంపెనీలపై పన్నులు: ఈయూ దేశాల ఆర్థిక మంత్రుల సూచన**

ఇరాన్ యుద్ధం కారణంగా పెరుగుతున్న చమురు ధరలతో లాభాలు దండుకుంటున్న ఇంధన కంపెనీలపై పన్నులు విధించాలని ఐదు యూరోపియన్ దేశాల ఆర్థిక మంత్రులు సూచించారు. ఈ మేరకు జర్మనీ, ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్, ఆస్ట్రియా దేశాల ఆర్థిక మంత్రులు ఈయూ కమిషన్‌కు ఓ లేఖ రాశారు. 'మనమంతా సంఘటితంగానే ఉన్నామని, చర్య తీసుకునేందుకు సిద్ధమేనని సంకేతం పంపడానికి ఇలాంటివి అవసరం' అని వారు అభిప్రాయపడ్డారు. చమురు కంపెనీలపై భారీగా పన్నులు విధించడం ద్వారా సామాన్య ప్రజలపై భారం తగ్గుతుందని వారు తెలిపారు.

**లెబనాన్‌లో 17 ఐరాస కెమేరాలు ధ్వంసం**

దక్షిణ లెబనాన్‌లో ఐరాస శాంతి పరిరక్షక కేంద్ర కార్యాలయానికి చెందిన 17 నిఘా కెమేరాలను ఇజ్రాయిల్ ధ్వంసం చేసింది. కోస్తా ప్రాంతంలోని నఖురా పట్టణంలో ఏర్పాటు చేసిన ఈ కెమేరాలను ఇజ్రాయిల్ దళాలు ధ్వంసం చేశాయని పేరు చెప్పడానికి ఇష్టపడని ఐరాస భద్రతాధికారి ఒకరు చెప్పారు. ఓ రకమైన లేజర్ సాయంతో వీటిని పనికి రాకుండా చేశారనిలెబనాన్‌లో ఐరాస తాత్కాలిక దళాల (యునిఫిల్) ప్రతినిధి కండిస్ అర్డియల్ తెలిపారు. పట్టణంలో తిష్ట వేసిన ఇజ్రాయిల్ సేనలు అక్కడి భవనాలను పెద్ద సంఖ్యలో నేలమట్టం చేశారని ఆమె అన్నారు.

# 'స్టార్టప్ స్టేట్' తెలంగాణ

ఈ సందర్భంగా విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ సాధించిన ప్రగతిని వివరించారు.సుదీర్ఘ పోరాటం ద్వారా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పరిపాలన, ఆవిష్కరణలు, ఆర్థిక వృద్ధిలో దేశానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. 'మేము అవకాశాల కోసం ఎదురుచూడలేదు. వాటిని అందిపుచ్చుకోవడానికి అద్భుతమైన పాలసీలను తయారు చేశాం. మౌలిక సదుపాయాలను కల్పించాం. తద్వారా పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని కలిగించి వృద్ధిని సాధించాం'అని కేటీఆర్ వివరించారు. 2027లో భారత్ 80వ స్వాతంత్ర్య దినోత్సవానికి సిద్ధమవుతున్న వేళ కేవలం పదేళ్లలోనే తెలంగాణ సాధించిన ఆర్థిక ప్రగతి గర్వకారణమన్నారు. రాష్ట్రాన్ని, దేశాన్ని నడిపే నాయకత్వానికి స్పష్టత ఉంటే జవాబుదారీతనం పెరుగుతుందని.. తద్వారా అభివృద్ధి వేగవంతమవుతుందని చెప్పారు. భవిష్యత్తు గురించి కేవలం మాటలు చెప్పడం కంటే, దానిని మనమే సృష్టించడం ఉత్తమమైన మార్గమని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

**రాష్ట్రాలే దేశాభివృద్ధికి ఇంజన్లు.. దీన్ని కేంద్రం గుర్తించాలి..**

భారతదేశ సమాఖ్య స్ఫూర్తిని కేటీఆర్ ప్రస్తావిస్తూ దేశాభివృద్ధి కేవలం ఒకే రకమైన విధానాల వల్ల కాకుండా ప్రతి రాష్ట్రం తనకున్న ప్రత్యేక బలాలను వినియోగించుకోవడం ద్వారా సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. 'భారత్ 28 ఇంజన్లుగల ఒక ఫార్ములా--1 రేసింగ్ కార్ లాంటిది. ప్రతి రాష్ట్రం తనదైన శైలిలో అభివృద్ధి చెందుతూ దేశ ప్రగతికి తోడ్పడాలి. అంతర్జాతీయ పెట్టుబడి నిర్ణయాలు చివరికి రాష్ట్రాలు, నగరాల స్థాయిలోనే జరుగుతాయి'అని కేటీఆర్ గుర్తుచేశారు. ఐటీ, పారిశ్రామిక రంగంలో తెలంగాణ అద్భుత ప్రగతి సాధించిందని తెలిపారు. 2014 నుండి 2023 మధ్య కాలంలో తెలంగాణ సాంకేతిక రంగం సాధించిన గణాంకాలను కేటీఆర్ వివరించారు. ప్రభుత్వ వేగవంతమైన నిర్ణయాలు, పటిష్టమైన ఎకో సిస్టమ్ కారణంగానే హైదరాబాద్ గ్లోబల్ ఐటీ దిగ్గజాలకు చిరునామాగా మారిందన్నారు. హైదరాబాద్‌లో అమెజాన్ ప్రపంచంలోనే అతిపెద్ద క్యాంపస్‌ను ఏర్పాటు చేసిందని, గూగుల్, ఆపిల్, మెటా, సేల్స్ ఫోర్స్, ఉబర్, మైక్రాన్ టెక్నాలజీ వంటి సంస్థలు తమ కీలక కార్యకలాపాలను ఇక్కడ నిర్వహిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆవిష్కరణలకు చిరునామా తెలంగాణ మారిందన్నారు. టీ--హబ్, వీ--హబ్, టీ--వర్క్స్, టాస్క్ వంటి సంస్థల ద్వారా తెలంగాణ ప్రభుత్వం ఆవిష్కరణలకు పెద్దపీట వేసిందని కేటీఆర్ వివరించారు. స్కైరూట్ ఏరోస్పేస్, డారి?వన్ బాక్స్, జెనోటి, హైరేడియస్ వంటి యూనికార్న్ సంస్థలు హైదరాబాద్ నుంచి పుట్టుకురావడమే తెలంగాణ సత్తాకు నిదర్శనమన్నారు.

# భయానికి, భరోసాకు పోరు

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ 'మహా జంగిల్‌రాజ్'ను నడిపిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. రాష్ట్రంలో ఈసారి అసెంబ్లీ ఎన్నికలు అధికార పార్టీ సృష్టించిన భయానికి, బీజేపీ ఇస్తున్న భరోసాకు మధ్య జరుగుతున్నాయని తేల్చిచెప్పారు. ఆదివారం ఉత్తర బెంగాల్‌లోని కూచ్‌బెహార్‌లో ఎన్నికల ప్రచార సభలో మోదీ ప్రసంగించారు. మాల్డా జిల్లాలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) విధుల్లో ఉన్న జ్యుడీషియల్ అధికారులపై అల్లరి మూకలు దౌర్జన్యానికి దిగి, నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించారు. తృణమూల్ కాంగ్రెస్ పాలనలో శాంతి భద్రతలు పూర్తిగా దిగజారాయని ఆరోపించారు. చొరబాటుదార్లను ఇక్కడి పాలకులు ఓటు బ్యాంకుగా మార్చుకున్నారని ధ్వజమెత్తారు. అధికార పార్టీ ప్రోద్బలంతోనే పొరుగుదేశం నుంచి జనం అక్రమంగా వలస వస్తున్నారని, దాంతో స్థానికంగాజనాభా నిష్పత్తిలో విపరీతమైన మార్పులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. చొరబాటుదార్ల వల్ల ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. జ్యుడీషియల్ అధికారులకు కూడా రక్షణ లేకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ అరాచక ప్రభుత్వం ప్రజలను కాపాడుతుందన్న విశ్వాసం లేదని తేల్చిచెప్పారు. తృణమూల్ కాంగ్రెస్ మహా జంగిల్‌రాజ్‌కు మాల్డా ఘటనే నిదర్శనమని పేర్కొన్నారు. బెంగాల్‌లో శాంతి భద్రతలకు అంత్యక్రియలు నిర్వహించడానికి అధికార పార్టీ కంకణం కట్టుకుందని దుయ్యబట్టారు.

**గూండాల బెదిరింపులను లెక్కచేయొద్దు**

కట్‌మనీ, అవినీతికి మారుపేరైన తృణమూల్ కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలని, అభివృద్ధి చేసి చూపించే బీజేపీని గెలిపించాలని బెంగాల్ ప్రజలకు మోదీ పిలుపునిచ్చారు. తాము అధికారంలోకి వచ్చాక అక్రమ వలసలను కచ్చితంగా అడ్డుకుంటామని, చొరబాటుదార్లను బయటకు పంపిస్తామని హామీ ఇచ్చారు. మారుతున్న జనాభా నిష్పత్తి కారణంగా సొంత గడ్డపై స్వేచ్ఛను కోల్పోతామనే భయం ప్రజల్లో ఉందన్నారు. ప్రజలు సొంత గడ్డపై గర్వంగా తల ఎత్తుకొని జీవించే పరిస్థితి తీసుకొస్తామని వెల్లడించారు. చొరబాటుదార్లను కాపాడేందుకే ఎస్ఐఆర్, సీఏఏను తృణమూల్ కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని ఆరోపించారు. హిందూ శరణార్థులకు భారతదేశ పౌరసత్వం దక్కడం ఆ పార్టీకి ఇష్టం లేదన్నారు. బుజ్జగింపు రాజకీయాల కారణంగా బెంగాల్ గుర్తింపునకు ముప్పు ఏర్పడిందన్నారు. బెంగాల్ అస్తిత్వాన్ని పణంగా పెట్టిన పార్టీలకు ఈసారి ఓటమి తప్పదని స్పష్టంచేశారు. పోలింగ్ రోజు తృణమూల్ కాంగ్రెస్ గూండాలు ఎన్ని బెదిరింపులకు దిగితే లెక్కచేయొద్దని ప్రజలకు మోదీ సూచించారు. చట్టంపై విశ్వాసంతో పోలింగ్‌లో పాల్గొనాలని కోరారు. ఎన్నికల సంఘంపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని, అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరుగుతాయని తెలిపారు. మే 4వ తేదీ తర్వాత చట్టం తన పని తాను చేస్తుందన్నారు. తృణమూల్ కాంగ్రెస్ అవినీతి, అరాచకాలపై తప్పనిసరిగా దర్యాప్తు జరిపిస్తామని పునరుద్ఘాటించారు. దోషులు శిక్ష నుంచి తప్పించుకోలేరని చెప్పారు. వారు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. బెంగాల్ మహిళలకు భద్రత, గౌరవం, సాధికారత కల్పిస్తామని, ఇది తన గ్యారంటీ అంటూ స్పష్టంచేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమల్లోకి తీసుకొస్తున్నామని ప్రధానమంత్రి చెప్పారు. కేంద్రం తీసుకొచ్చిన లఖ్‌పతి దీదీ పథకం గురించి ప్రస్తావించారు. జనాభా పెరుగుదలను నియంత్రించిన రాష్ట్రాలకు నియోజకవర్గాల పెంపులో ఎలాంటి అన్యాయం జరగదని మోదీ మరోసారి హామీ ఇచ్చారు. అన్ని రాష్ట్రాల భాగస్వామ్యం, హక్కులకు కచ్చితంగా రక్షణ ఉంటుందన్నారు.

# ప్రజా ఉద్యమంగా నీటి భద్రత

**సమర్థంగా నీటి యాజమాన్య నిర్వహణ**

తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలకు నీళ్లు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సాగునీటి సంఘాలకు సీఎం చంద్రబాబు సూచించారు. వేసవికి ముందు ఆరు మీటర్ల లోతులో, వర్షాకాలం తర్వాత మూడు మీటర్ల లోతులోనే జలాలు అందుబాటులో ఉండేలా కార్యాచరణను అమలు చేయాలని స్పష్టం చేశారు. మైక్రో ఇరిగేషన్‌ను అమలు చేయాలని, ప్రతి చుక్కనూ సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 7, 8 మీటర్ల లోతున భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ మట్టాన్ని ఒకటిన్నర మీటర్ల లోతులోనే అందుబాబులో ఉండేలా కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. జలధార పేరుతో అన్నమయ్య జిల్లాలో అమలు చేస్తున్న నీటి సంరక్షణ చర్యలను సీఎం చంద్రబాబు అభినందించారు. భూగర్భ జలాలను పెద్దఎత్తున పెంపొందించారంటూ అధికారులను ప్రశంసించారు. ఫీడర్ చానళ్లను క్లియర్ చేయాలని, పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. అప్పుడే ఎక్కువ నీటిని సంరక్షించుకోగలమన్నారు. చెక్‌డ్యామ్‌లను అవసరమైన మేర మరమ్మతులు చేసుకోవాలన్నారు. సాగునీటి సంఘాలు వాటర్ బడ్జెట్ తయారు చేసుకోవాలని సూచించారు. సాగునీటి సంఘాల పరిధిలో నీటి లభ్యతను గుర్తించాలన్నారు. కొద్దిపాటి శ్రద్ధ పెడితే లక్ష్యాలను చేరుకోవడం సాధ్యమేనని, ప్రజల భాగస్వామ్యంతో వందరోజుల నీటి సంరక్షణ ఉద్యమం జరగాలని సూచించారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను ప్రాధాన్యక్రమంంలో చేపడుతున్నామని చెప్పారు. హంద్రీ–నీవా, గాలేరు–నగరి, తెలుగుగంగ వంటి ప్రాజెక్టులకు ఎన్టీఆర్ హయాంలో శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు. ఇప్పుడు పోలవరం సహా పలు ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామన్నారు. ప్రతి ఎకరాకూ సాగునీటిని ఇవ్వాలన్న సంకల్పంతో ఉన్నామన్నారు. వర్షపు నీటిని సంరక్షిస్తున్నామని, 2024 మే నుంచి 2025 మే వరకూ 2.20 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయని వివరించారు.

**నేడు యాడికిలో చంద్రబాబు పర్యటన**

సోమవారం అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం యాడికిలో జరిగే కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. అక్కడ సాగునీటి వినియోగదారుల సంఘాలు, రైతులతో సమావేశమవుతారు. హంద్రీ–నీవా కాలువ ద్వారా ప్రయోజనం పొందుతున్న రైతులతో మాటామంతీ నిర్వహిస్తారు. పంట కాలువ విస్తరణ ద్వారా ఆయకట్టుకు అందిస్తున్న జలాలు, సాగునీటి ప్రాంతాల్లో నీటి లభ్యత తదితర అంశాలపై మాట్లాడుతారు. సమర్థ నీటి యాజమాన్య నిర్వహణతో రాష్ట్రవ్యాప్తంగా సాధించిన నీటి భద్రత, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, భూగర్భ జలాల మట్టాల పెరుగుదల వంటి అంశాలపై సీఎం మాట్లాడుతారు.

# రాజ్యాంగం సజీవం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎస్వీ భట్టి, జస్టిస్ అలోక్ అరాధే, హైకోర్టు సీజే జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్‌తో కలసి భూమిపూజ నిర్వహించారు. అనంతరం సీజేఐ మాట్లాడారు. ఈ కార్యక్రమం లాంఛనం కాదని.. రాజ్యాంగ విధి అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత దశాబ్ద కల కార్యరూపం దాలుస్తోందని చెప్పారు. ఈ విషయంలో ప్రభుత్వ సహకారం అభినందనీయమన్నారు.

**మౌలిక సదుపాయాల కల్పన తప్పనిసరి..:** 'న్యాయవ్యవస్థలో నా సుదీర్ఘ వృత్తి జీవితంలో నేను ఒకటి నమ్ముతాను. ప్రతి కార్యానికి మూడు దశలు ఉంటాయి. ప్రారంభం ఉద్దేశాన్ని వెల్లడిస్తుంది. మధ్యభాగం పట్టుదలను ప్రదర్శిస్తుంది. ముగింపు వాగ్దానం నెరవేరిందా లేదా అనేది తెలియజేస్తుంది. ప్రజలంతా న్యాయపీఠం, చిహ్నం, కార్యకలాపాలను మాత్రమే చూస్తారు. అదే మనకు కనిపించే న్యాయవ్యవస్థ. కానీ ప్రతి కోర్టు గది వెనుక దాన్ని నడిపించే ఓ ప్రపంచం ఉంటుంది. అక్కడే న్యాయమూర్తులు నివసిస్తారు.. శిక్షణ పొందుతారు.. తీర్పులు భద్రపరుస్తారు.. ఈరోజు దానికి మనం పునాది వేస్తున్నాం. మనం ఇక్కడికి రావడం లాంఛనం కాదు.. రాజ్యాంగ విధి. న్యాయం అందరికీ అందుబాటులో ఉండాలన్న సూత్రాన్ని రాజ్యాంగ నిర్మాతలు విశ్వసించారు. ప్రతి రాష్ట్రంలో ఓ హైకోర్టు ఏర్పాటు చట్టపరమైన అవసరమే కాకుండా గణతంత్ర రాజ్య నిబద్ధతగా ఎప్పుడూ భావిస్తాను. అలాంటి నిబద్ధతకు.. అందుకు ఆధారమైన మౌలిక సదుపాయాలు ఉన్నంత వరకే అర్థం ఉంటుంది. అది లేకుంటే కేవలం కాగితాల్లోనే మిగిలిపోతుంది. తెలంగాణలో అది నిర్దిష్ట రూపాన్ని సంతరించుకుంటోంది. జోన్--1లో పనులు చురుగ్గా జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆ భవనాలు ఓవక్క రూపుదిద్దుకుంటుండగానే జోన్--2 మొదలవుతోంది. న్యాయవ్యవస్థ, రాష్ట్ర ప్రభుత్వం సమాంతరంగా ముందుకు సాగాలని నిర్ణయించుకున్నాయి. అది సరైనదే. ప్రస్తుత భవనం చారిత్రాక కట్టడం అయినప్పటికీ ప్రస్తుత అవసరాలకు సరిపోవడం లేదు. రాబోయే వందేళ్ల అవసరాలు తీర్చే మౌలిక సదుపాయాలను కల్పించడం ఓ లక్ష్యం మాత్రమే కాదు.. తప్పనిసరి. కోర్టు గదులతోపాటు జోన్--2 కూడా అంతే ముఖ్యం. చెట్టులో మనకు కొమ్మలు, ఎత్తు మాత్రమే కనిపిస్తాయి. కానీ తుపాను వచ్చినప్పుడు వేర్లు మాత్రమే దాన్ని కాపాడతాయి. జోన్--2 న్యాయవ్యవస్థకు వేర్లలాంటింది'అని పేర్కొన్నారు.

**దశాబ్దం తర్వాత కార్యరూపం :** 'హైకోర్టు రోజువారీ కార్యకలాపాలు తన నియంత్రణలో లేని ఏర్పాట్లపై ఆధారపడి ఉంటుంది. ఈ 100 ఎకరాల ప్రాంగణం ఆ పరిస్థితిని మారుస్తుంది. సంస్థాగత స్వయం సమృద్ధిని సిద్ధాంతం నుంచి ఆచరణలోకి తీసుకొచ్చినప్పుడు అది ఇలానే కనిపిస్తుంది. ఇక్కడ నిర్మించబోయే ఆడిటోరియంలో న్యాయవ్యవస్థకు శిక్షణా కార్యక్రమాలు, పౌరుల కోసం న్యాయ అవగాహన శిబిరాలు నిర్వహించడం శుభ పరిణామం. సెంట్రల్ రికార్డ్ రూమ్.. తీర్పులను భద్రపర్చడం అత్యంత ప్రాధాన్యం. ప్రస్తుత హైకోర్టులో 2009లో చోటుచేసుకున్న ఓ అగ్నిప్రమాదం కొత్త భవన నిర్మాణానికి బీజం వేసింది. ఫుల్ కోర్టు ఆమోదం, హైకోర్టు చీఫ్ జస్టిస్‌ల ప్రస్తావనతో దశాబ్దం తర్వాత కార్యరూపం దాల్చింది. తెలంగాణతోపాటు పలు రాష్ట్రాలు న్యాయ వ్యవస్థకు సదుపాయాల కల్పనకు ముందు వస్తున్నాయి. అత్యంత అవశ్యకం అని గుర్తిస్తున్నాయి. ఇది గొప్ప విషయం. రూ. 2,583 కోట్లతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వ సహకారాన్ని అభినందిస్తున్నా. న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ ఒకే లక్ష్యంతో పనిచేస్తే రాజ్యాంగం నిజంగా సజీవంగా నిలుస్తుంది. ఇక్కడి నుంచి తీసుకునే ప్రతి నిర్ణయం భవిష్యత్తుకు మార్గదర్శకం కావాలి'అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆకాంక్షించారు.

# ఈళవ ఓట్లే కీలకం

కేరళలో అసెంబ్లీ ఎన్నికల ప్రచార హోరు తారస్థాయికి చేరింది. పాలక ఎల్డీఎఫ్, విపక్ష యూడీఎఫ్ కూటములు పోటాపోటీ ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. బీజేపీ కూడా ఈసారి రాష్ట్రంలో గట్టిగా ఉనికి చాటుకోవాలని కృతనిశ్చయంతో ఉంది. ఈ క్రమంలో ఈళవ సామాజికవర్గం ఓట్లపై అన్ని పార్టీలూ కన్నేశాయి. ఆరు జిల్లాల్లో కనీసం 53 అసెంబ్లీ స్థానాల్లో వీరి ఓట్లు నిర్ణాయకంగా మారనున్నాయి.

**ఈళవల ప్రాబల్యం :** కేరళ జనాభాలో హిందువులు 54.73%. ముస్లింలు 26.56%, క్రైస్తవులు 18.38 శాతమున్నారు. హిందూ జనాభాలో ఈళవ సామాజికవర్గం అత్యధికంగా 21.60 శాతం ఉంది. తర్వాత నాయర్లు 14.9 శాతం, ఎస్సీలు 9 శాతం, ధీవర 3 శాతం, ఓబీసీ 3 శాతం, బ్రాహ్మణులు 2 శాతం, ఎస్టీలు ఒక శాతం చొప్పున ఉన్నారు. ట్రావెన్‌కోర్ ప్రాంతంలో ఈళవ సామాజికవర్గం ప్రాబల్యం ఎక్కువగా ఉంది. మొత్తం 6 జిల్లాల్లో 53 అసెంబ్లీ స్థానాల్లో 40 శాతం నుంచి 70 శాతం దాకా ఈళవ వర్గం ఓటర్లే ఉన్నా రు! తిరువనంతపురం జిల్లా లో 14 స్థానాలు, కొల్లంలో 11, కొట్టాయంలో 9, అలప్పుజలో 9, పత్తనంతిట్టలో 5, ఇడుక్కిలో 5 స్థానాల్లో ఫలితాలను వీరే శాసిస్తున్నారు.

**ఓట్ల కోసం పాట్లు :** ఈళవ ఓట్ల కోసం పార్టీలన్నీ తలపడుతున్నాయి. కేరళలో అణగారిన వర్గాలకు జరిగిన చారిత్రక అన్యాయాలపై పోరాడింది తామేనని వామపక్షాలు ప్రచారం చేసుకుంటున్నాయి. ఒకప్పటి నంగేలి పోరాటాన్ని, చన్నార్ తిరుగుబాటును గుర్తు చేస్తున్నాయి. ఎన్‌సీఈఆర్‌టీ 9వ తరగతి చరిత్ర పుస్తకం నుంచి ట్రావెన్‌కోర్ కుల పోరాటాల అధ్యాయాన్ని తొలగించడం కేరళలో వివాదంగా మారింది. దీన్ని బీజేపీ కుట్రగా ముఖ్యమంత్రి పినరయి విజయన్ అభివరి?ణంచారు. ఆ పాఠాలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేకంగా బోధించేలా చర్యలు తీసుకున్నారు. ఈళవ ఓటుబ్యాంకును కొల్లగొట్టేందుకు బీజేపీ కూడా గట్టి ప్రయత్నాలే చేస్తోంది.

**ఓటింగ్ సరళిలో మార్పులిలా :** కేరళ హిందూ ఓటర్లలో అత్యధికులు వామపక్ష కూటమి వైపే నిలుస్తున్నారు. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో హిందూ ఓటర్లలో 48% లెఫ్ట్‌కు మద్దతిచ్చారు. 2021 అసెంబ్లీ ఎన్నికల నాటికి అది 50 శాతానికి పెరిగింది. 25% కాంగ్రెస్ వైపు నిలవగా 21% బీజేపీకి మద్దతిచ్చారు. అయితే కులాలవారీగా సమీకరణాల్లో మార్పులు కనిపిస్తున్నాయి.

## “శ్రీ గాయత్రి లో అట్టహాసంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు”



**విజ్ఞాన్ దినపత్రిక,** గూడూరు పట్టణంలోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు యూకేజీ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. చిన్నారులు యూకేజీ విజయవంతంగా పూర్తి చేసుకొని ప్రైమరీకి అడుగుపెట్టిన సందర్భంగా సర్టిఫికెట్స్ మరియు మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అద్భుతంగా అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ కె.పి. ప్రసాద్ రావు మాట్లాడుతూ విద్యార్థులకి గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం అభినందనీయమని, చిన్నారులు భవిష్యత్తులో అద్భుత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ శ్రీ గాయత్రి స్కూల్ కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి వినూత్నంగా ఆలోచిస్తూ విద్యార్థుల విజయమే పరమావధిగా ఉపాధ్యాయులు మరియు మేనేజ్మెంట్ కృషి చేస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరి, హరిత, గీతిక ,మాధవి, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధాని అమరావతి : ఎమ్మెల్యే జూలకంటి



**విజ్ఞాన్ దినపత్రిక, మణికుమార్, కారంపూడి (ఏప్రిల్: 6 )** కారంపూడి మండలం,ఒప్పిచర్ల గ్రామంలోని కళ్యాణ మండపంలో మహిళా రైతుల ఆధ్వర్యంలో ఆదివారం భారీ రంగవల్లులను తీర్చి, శాశ్వత రాజధాని అమరావతిని ఆమోదించిన సందర్భంగా మహిళ రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళా రైతులు వేసిన ముగ్గుల దీపాలను ఆయన వీక్షించారు. మహిళలను అయన అభినందించారు. ఈ సందర్భంగా మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధాని అమరావతి కావడంతో రాష్ట్రంలో ప్రతి ఇంటిలో దీపాల కాంతులతో సంబరాలు చేసుకుంటున్నారు. రాజధాని రాకతో ఎంతోమంది బిడ్డలకు ఉద్యోగాలు అవకాశాలు రానున్నాయని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : దద్దాల



**కనిగిరి విజ్ఞాన్ పత్రిక రిపోర్టర్ :** కనిగిరి స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ని ఆదివారం సాయంత్రం పీసీపల్లి మండల పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ముద్దపాడు పంచాయతీ కమిటీలకు సంబందించిన నియామక పత్రాలను ఆయనకు అందజేశారు అందరూ సమిష్టిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యం పనిచేయాలని వారికి దద్దాల నారాయణ యాదవ్ సూచించారు.. ఈ కార్యక్రమంలో గోపవరపు బొర్రారెడ్డి,ఓకే రెడ్డి, మూలే రాజశేఖర్ రెడ్డి, వాకమల్ల రాజశేఖర్ రెడ్డి,ముద్దా మహేష్ కుమార్, పాత కొట్టు పిచ్చిరెడ్డి, తిరుమలకుడి మహేష్ తదితరులు పాల్గొన్నారు..

## విలువ

ఒక మనిషికి ఇవ్వాల్సిన
సమయంలో విలువ ఇవ్వకపోతే
తర్వాత నువ్వు ఇద్దామనుకున్న
అది తీసుకోవడానికి సిద్ధంగా ఉండరు
ఎందుకంటే.... ప్రతీ మనిషికీ
ఆత్మాభిమానం అనేది
ఒకటి ఉంటుంది కదా!
సంతోషం అందరూ పంచుకుంటారు
కానీ... బాధను కొందరే స్వీకరిస్తారు
మనం ఎదిగిన తర్వాత
మనతో చాలా మంది ఉంటారు
కానీ... మనం ఎదిగేటప్పుడు
మనతో కొందరే ఉంటారు
ఆ కొందర్ని మరిచిపోకూడదు
అలా మర్చిపోయిన రోజూ
మనం బ్రతికున్నా లేనట్టే
మనం జీవితంలో
ఏం కోల్పోయినా పర్వాలేదు
కానీ... మన అనే అనుబంధాలను
ఎప్పటికీ కోల్పోకూడదని
ఎప్పటికీ గుర్తించుకోవాలి.



**రచన : కె.మురళీమోహన్ రాజు**
**నెల్లూరు.**
**చరవాణి : 9866179385**

## మన గూడూరు - మన సునీల్



**విజ్ఞాన్ దినపత్రిక,** గూడూరు పట్టణం కులరహిత సమాజం కోసం పాటుబడిన బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగజ్జీవన్ రాం గారి 118 వ జయంతి వేడుకలలో భాగంగా టవర్ క్లాక్ సెంటర్ నందు వారి చిత్రపటానికి నివాళలు అర్పించి వారు బడుగు బలహీన వర్గాల కోసం చేసిన పోరాటాలు గురించి తెలిపి పేదలకు చీరలు అందించిన డాక్టర్ పాశిం సునీల్ కుమార్ శాసన సభ్యులు

## రాష్ట్ర ప్రభుత్వం వెంటనే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి

**నెల్లూరు :ఏప్రియల్. 5/(విజ్ఞాన్ ప్రతినిధి )** ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) నెల్లూరు జిల్లా 6వ మహాసభ నెల్లూరు భారత కమ్యూనిస్టు పార్టీ రామకోటయ్య భవన్ లో ఆదివారం బోసు అధ్యక్షత నా జరిగింది ఈ మహాసభలలో రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు సత్యనారాయణ సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శంకర్ కిషోర్ మహిళా సమైక్య జిల్లా కన్వీనర్ కె వినోదమ్మ లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ప్రారంభిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టడంతో పాటు ఎన్నికల ప్రచారంలో మేము అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డు పునః ప్రారంభిస్తామని పెండింగ్లో ఉన్న క్లైమూలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి రెండు సంవత్సరములు గడిచిన తర్వాత తూ తూ మంత్రంగా సంక్షేమ బోర్డును ప్రారంభించడం జరిగిందన్నారు, గత ఏడు సంవత్సరముల నుండి పెండింగ్ లో ఉన్న 46వేల క్లైములకు నిధులు మంజూరు చేయకపోవడం అత్యంతఅమానుసమన్నారు అంతేకాకుండా ప్రమాద బీమా భవన నిర్మాణ కార్మికులకు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తుదన్నారు ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న మాదిరిగా ప్రమాద వశాత్తుమరణించిన కార్మికులకు 10 లక్షలు రూపాయలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని సహజ మరణం చెందిన కార్మికులకు ఐదు లక్షల రూపాయలు చెల్లించాలని ప్రమాదవశాత్తు అంగవైకల్యం చెందిన కార్మికులకు ఐదు లక్షల రూపాయలు చెల్లించాలని వివాహ కానుక లక్ష రూపాయలు ఇవ్వాలని ప్రసూతి కానుక 50 వేల రూపాయలు చెల్లించాలని 50 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికుడికి ఐదువేల రూపాయలు పెన్షన్ మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని



డిమాండ్ చేశారు అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు గౌరవ అధ్యక్షులు: కె ఆంజనేయులు,ప్రెసిడెంట్: షేక్ మీరా కార్యదర్శి: షేక్ ముక్తియార్ ఉపాధ్యక్షులు: సుబ్బారాయుడు వెంగయ్య సహాయ కార్యదర్శులు: కొండయ్య శ్రీనివాసరావు కోశాధికారి: చక్రవర్తి, శివ శ్రీనివాసరావు మహమ్మద్ విజయ్ కుమార్ రమణయ్య తదితరులతో 15 మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవముగా ఎన్నుకోవడం జరిగినది ఈ కార్యక్రమంలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు సిహెచ్ ప్రభాకర్ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యమాల మధు నందిపోగు రమణయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిరాజ్, శశి కుమార్, షాన్ వాజ్, జిల్లా కార్మిక కార్మిక సంక్షేమ శాఖ అధికారి రామారావు, మాజీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ రాసపాలెం రఘు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జిలాని ఖాన్, బొట్టు శ్రీనివాస్,శిరీష తదితరులు పాల్గొన్నారు

## ఆ రోడ్డున వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే!!

**కందుకూరు ( విజ్ఞాన్ రిపోర్టర్)** కందుకూరు పట్టణ నడిబొడ్డులో ఉన్న మునిసిపల్ పార్క్ ప్రక్క దారి మలమూత్ర విసర్జనకు వనరుగా మారింది. దీంతో ఆ రోడ్డుపై పయనించాలంటే ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటుచేసిన



మున్సిపల్ పార్కుకు వచ్చే సందర్శకులు సైతం ఈ దుర్గంధాన్ని భరించలేక ఇబ్బంది పడుతున్నారు. ఆకతాయిలు మరీ రోడ్డు మీదే మూత్ర విసర్జన చేయటం వల్ల ఆ ప్రాంతమంతా దుర్వాసనతో నిండిపోయింది. ఇప్పటికైనా కందుకూరు మున్సిపల్ అధికారులు ఈ రోడ్డు ను శుభ్రపరిచి, మూత్ర విసర్జన శాలలను పట్టణంలో అవసరమైన చోట ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## కారంపూడి జగజ్జివన్ రామ్ 118వ జయంతి వేడుకల్లో ముఖ్యఅతిధిగా పాల్గొన్న రాష్ట్ర ఎస్సి కమిషన్ సభ్యులు మేకల. బిక్షం దాస్

**-బాబు జగజ్జివన్ రామ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలి**



**విజ్ఞాన దినపత్రిక, మణికుమార్, కారంపూడి (ఏప్రిల్: 6 )**

మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబు జగజ్జివన్ రామ్ ఆశయసాధన కోసం నేటి యువత పాటుపడవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాష్ట్ర ఎస్సి కమిషన్ మెంబర్ మేకల. బిక్షం దాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కారంపూడిలోని మాచర్ల రోడ్డులో ఏర్పాటు చేసిన బాబు జగజ్జివన్ రామ్ జయంతి వేడుకల్లో అయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా అయన ముందుగా జగజ్జివన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దళితవర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి బాబు జగజ్జివన్ రామ్ అని స్వాతంత్ర ఉద్యమ నేతగా సంఘ సంస్కర్తగా, దళిత హక్కుల పరిరక్షకుడు భారత మాజీ ప్రధాని డాక్టర్ బాబు జగజ్జివన్ రామ్ ఆశయాలను ఈ సందర్బలను అయన కొనియాడారు. అనంతరం కారంపూడి ఎస్సి నాయకులు ఎస్సి కమిషన్ సభ్యులు మేకల. బిక్షం దాస్ ను ఎస్సి నాయకులు కాల్వ. పేరయ్య, దాసు, తదితర ఎస్సి నాయకులు ఎస్సి కమిషన్ సభ్యులు మేకల. దాస్ ను దుస్సాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సి సెల్ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సాహితీ సాంస్కృతిక సంస్థలను ప్రతి ఒక్కరూ ఆదరించాలి

సాహితీ సాంస్కృతిక సంస్థలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని డాక్టర్ కొండూరు హరి నారాయణ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొండూరు హరి నారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం నెల్లూరు టౌన్ హాల్ స్టేజీపై జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తనకు పురస్కారం అందించినందుకు ఆయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. తాను ఎంతో కాలం నుంచి సాహితి సంస్కృతిక సంస్థలకు చాతనైన సహాయం అందిస్తున్నానని వారు సమాజంలోని ప్రముఖులను గౌరవిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తనకు పురస్కారం అందిన సందర్భంగా పాత నెల్లూరు జిల్లాలోని సాహితీ సంస్కృతిక సంస్థల నిర్వాహకులను సత్కరించాలని మే 31న టౌన్ హాల్లో కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 1911 జూన్ ఒకటో తేదీన మద్రాస్ ప్రెసిడెంట్ లో ఉన్న చంగల్పట్టు నుంచి నెల్లూరును విడదీసి ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 2008 జూన్ 1 ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరు ను శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గా మార్చడం జరిగిందన్నారు. నెల్లూరు చరిత్ర విశేషాలు తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం




జరిగిందన్నారు. సాహితీ సంస్కృతిక సంస్థల అధ్యక్ష కార్యదర్శులు తమ పేర్లు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, చిరునామా రిజిస్ట్రేషన్ అయితే అందుకు సంబంధించిన సమాచారం, ఎంత కాలం నుంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న వివరాలు, ఫోన్ నెంబరు అలహరి వెంకటేష్ వాట్సాప్ కు ఏప్రిల్ 20వ తేదీ లోపల పంపాలి . ఫోన్ నెంబర్ 8618325086 కు పంపాలి. విలేకరుల సమావేశంలో నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్, ప్రముఖ డైరెక్టర్ నటుడు సింగంశెట్టి మురళీమోహన్, ఎండి నగ్మా, అలహరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 118 వ భారత ఉపప్రధాని డా :బాబూ జగజీవన్ రామ్ గారి జయంతి వేడుకలు



**ఏసిపోగు బాబు విజ్ఞాన దిన పత్రిక రిపోర్టర్ ఆత్మకూరు** 118వ భారత ఉపప్రధాని డా :బాబూ జగజీవన్ రామ్ గారి జన్మదిన వేడుకలు ఆత్మకూరు పట్టణం లో ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మరియు ఎమ్మార్పీఎస్ టీం (100) స్టేట్ కో ఆర్డినేటర్ ఏసిపోగు బాబు మాదిగ గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులు గా టీడీపీ పార్టీ నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు బొర్రా బాబు గారు, హైకోర్టుఅడ్వకేట్ నేలటూరు నరసింహులు గారు రిటైర్డ్ ఆర్టీసీ కండక్టర్ కార్మిక నాయకుడు యూ. నరసింహులు తదితరులు పాల్గొని ప్రసంగించడం జరిగింది. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయుకులు భూలోకం రత్నం మాదిగ మామూడూరు ప్రసాద్ మాదిగ కటారి నాగవర్ధన్ మాదిగ బొజ్జ శ్రీహరి మాదిగ పెంచలస్వామి మాదిగ ఏసిపోగు అశోక్ కుమార్, ఉప్పునూతల చక్రవర్తి మాదిగ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నగరం లో ఘనంగా హనుమాన్ ర్యాలీ..!

**-ర్యాలీ ని ప్రారంభించిన దీపా వెంకట్..!**

**నెల్లూరుసిటీ... ఏప్రియల్.. 5/(విజ్ఞాన్ప్రతినిధి ):** జై శ్రీరామ్ జై జై శ్రీరామ్ అంటూ నెల్లూరు నగరం మార్మోగింది. ఆదివారం నెల్లూరునగరం లోని ఏ సి. స్టేడియం నుంచి హనుమాన్ శోభా యాత్రను ప్రారంభించారు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కుమార్తె దీపా వెంకట్ హనుమాన్ విగ్రహంకు పూజ చేసి టెంకాయ కొట్టి ర్యాలీ



ప్రారంభం చేశారు... మరో ముఖ్య అతిధి కమలా నంద భారతి కూడ పూజలు నిర్వహించారు. ఈసందర్బంగా ఆయనమీడియా తో మాట్లాడుతూ ఈ నాటి ఈ ర్యాలీ కీ విచ్చేసి న హిందూ బంధువులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు.. హనుమాన్ పై ఉన్న భక్తి చాటిన యువత ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపు నిచ్చారు...ఈ కార్యక్రమం లో హిందూ చైతన్య వేదిక నాయకులు ఆర్ యస్ యస్, బీజేపీ, విశ్వహిందుపరిషత్ కార్యకర్తలు నాయకులు పుర ప్రజలు పాల్గొన్నారు

# వడదెబ్బతో ఎమ్మార్పీఎస్ నాయకుడు గోచిపాతల వెంగయ్య మృతి..!





-వెంగయ్య పార్థివదేహానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఘన నివాళులు..!

-కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.25 వేల తక్షణ ఆర్థిక సహాయం..!

**వింజమూరు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ ఏప్రిల్ 5** వింజమూరు మండలం అరుంధతివాడకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు గోచిపాతల వెంగయ్య తీవ్ర వడదెబ్బ కారణంగా ఆకస్మికంగా మృతి చెందడం ఆ ప్రాంత ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ అక్కడికి చేరుకొని, వెంగయ్య పార్థివదేహానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం బాధతో మునిగిపోయిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇస్తూ, కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వెంటనే 25 వేల రూపాయలను మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, వెంగయ్య కి నివాళులు అర్పించారు.

## మార్కాపురం ప్రమాద ఘటనలో మృతి చెందిన ఆత్మకూరి చిన్నయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్..!

-ప్రభుత్వం తరపున అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ..!



**కలిగిరి విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ ఏప్రిల్ 5 :** మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో జరిగిన విషాదకర బస్సు ప్రమాదంలో కలిగిరి మండలం బొమ్మరాజుచెరువు గ్రామమునకు చెందిన ఆత్మకూరి చిన్నయ్య మృతి చెందిన విషయం విధితమే. వారి కుటుంబ సభ్యులను ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ వారి స్వగృహానికి వెళ్ళి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధలో మునిగిపోయిన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పుతూ, వారి దుఃఖాన్ని పంచుకున్నారు. చిన్నయ్య ఆకస్మిక మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఈ క్లిష్ట సమయంలో తాను మరియు ప్రభుత్వం వారి కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరఫున అందవలసిన అన్ని సహాయ సహకారాలను త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కుటుంబ సభ్యుల భవిష్యత్తు కోసం అవసరమైన ప్రతి సహాయం అందించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన శాసనసభ్యులు కాకర్ల సురేష్



కర్నూలు. పాణ్యం శాసనసభ్యురాలు, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు చరితా వెంకట రెడ్డి కుమారుడు జనార్ధన్ రెడ్డి , అలాగే అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతుల కుమార్తె సనాతని వివాహ మహోత్సవం ఈ నెల 2వ తేదీన హైదరాబాద్ నగరంలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని, నేడు కర్నూలులోని "రాగమయూరి రిసార్ట్"నందు ఏర్పాటు చేసిన రిసెప్షన్ కార్యక్రమం ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించబడింది. ఈ వేడుకకు ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ విచ్చేసి, నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖశాంతులతో, ఐశ్వర్యసంపదలతో నిండి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, బంధుమిత్రులు, పార్టీ నాయకులు పాల్గొని, నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## డాక్టర్ బాబు జగజీవన్ రామ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలి : జిల్లా కలెక్టర్




డాక్టర్ బాబు జగజీవన్ రామ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు సాగవలసిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పేర్కొన్నారు. ఆదివారం బాబు జగజ్జివన్ రావు 118 వ జయంతి సందర్భంగా స్థానిక వేదాయపాలెం సెంటర్లోని జగజీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బాబు జగజీవన్ రామ్ దార్శ్నికుడు, పరిపాలన దక్షుడు, గొప్ప రాజకీయ వేత్త అని కొనియాడారు. సుదీర్ఘకాలం సుమారు అర్ధ శతాబ్ద కాలం రాజకీయాలలో ఉంటూ అనేక మంత్రి పదవులు అనంతరం భారత ఉప ప్రధాని పదవిని చేపట్టడం ఆయన ప్రతిభకు నిదర్శనం అన్నారు. ఆయన రాజకీయ జీవితం దేశ సేవకి అంకితం చేసిన మహానేత బాబు జగజ్జీవన్ రామ్ అని అన్నారు. స్వాతంత్ర పోరాటంలో మహాత్మా గాంధీ తో పాటు సత్యాగ్రహంలో పాల్గొని లాఠీ దెబ్బలు తిన్నారని ఆయన అన్నారు. ఇది ఆయన ధైర్యసహసాలకు, దేశభక్తికి ఉదాహరణ అని కొనియాడారు. పండిట్ జవహర్లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ మరియు మురార్జీ దేశాయ్ కాలంలో కీలక పాత్ర పోషిస్తూ దేశ అభివృద్ధికి కృషి చేశారన్నారు. అనంతరం జగజ్జీ మతం 118 వ జయంతి సందర్భంగా కేక్ ని కట్ చేసారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిడి శోభారాణి తదితరులు పాల్గొన్నారు

## వి ఎస్ యు లో జాతీయ సేవా పథకం -1 ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి




బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని ఈరోజు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని సర్ సి.వి. రామన్ సెమినార్ హాల్ లో విద్యార్థుల సమక్షంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ భారతదేశ సామాజిక న్యాయం కోసం చేసిన సేవలు, అణగారిన వర్గాల అభివృద్ధికి చేసిన కృషి, ఆయన నాయకత్వ గుణాలు గురించి విశదీకరించారు. ఆయన జీవితం ప్రతి విద్యార్థికి ప్రేరణగా నిలుస్తుందని, సమాజంలో సమానత్వం, న్యాయం కోసం అందరూ పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి. హెచ్ విజయ మాట్లాడుతూ, ఎన్.ఎస్.ఎస్ కార్యకలాపాల ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థుల్లో సేవా భావం, సామాజిక బాధ్యతను పెంపొందించడం అని తెలిపారు. బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ యూనిట్ వన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్.వి.ఎస్.ఎస్ నాగభూషణరావు, అధ్యాపకులు మరియు విశ్వవిద్యాలయ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు బాబు జగ్జీవన్ రామ్ జీవిత విశేషాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కొందరు విద్యార్థులు ప్రసంగాలు చేసి ఆయన గొప్పతనాన్ని వివరించారు.

## రాష్ట్ర తీర ప్రాంత మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారానికై కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది

-కేవలం గస్తి కోసమే అధునాతన 650 హార్స్ పవర్ కలిగిన 4 బోట్ల కొనుగోలుకు నిర్ణయం

-మత్స్యకారుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

-రాష్ట్ర మైన్స్ ఎక్సైజ్ శాఖ మాత్యులు కొల్లు రవీంద్ర వెల్లడి

**నెల్లూరు, ఏప్రిల్ 5 :**

రాష్ట్రంలోని తీర ప్రాంత మత్స్యకారుల సమస్యల శాశ్వత పరిష్కారానికై కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర మైన్స్, ఎక్సైజ్ శాఖామాత్యులు కొల్లు రవీంద్ర తెలిపారు. ఆదివారం నెల్లూరు జిల్లా కలెక్టరేట్లో పుదుచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల మత్స్యకారుల నుండి రాష్ట్రంలోని ముఖ్యంగా నెల్లూరు జిల్లాలోని మత్స్యకారులకు ఎదురవుతున్న సమస్యల గురించి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర, శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, కోస్టల్ సెక్యూరిటీ ఐజి గోపినాథ్ జెట్టి లతో మంత్రి రవీంద్ర సమీక్షించారు. అనంతరం పాత్రికేయ సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడిస్తూ మత్స్యకారుల సమస్యల శాశ్వత పరిష్కారానికై కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ముఖ్యమంత్రి సైతం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి తగు ఆదేశాలు అందజేశారన్నారు. ఇప్పటికే మూడు గస్తీ బోట్లు సముద్రంలో నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నాయని, మరొక బోటును తిరుపతిలో ఈరోజు నుండి అందుబాటులో ఉంచామన్నారు. తమిళనాడు బోటులను దీటుగా ఎదుర్కొనే విధానంలో భాగంగా సముద్రంలో గస్తి కోసమై 650 హార్స్ పవర్ కలిగిన నాలుగు అధునాతన బోట్లను కొనుగోలు చేసేందుకు నిర్ణయించామన్నారు. మెరైన్ పోలీసు, రెవిన్యూ, మత్స్య, అటవీ, అగ్నిమాపక శాఖ తదితర శాఖలతో కూడిన గస్తి బృందం నిరంతరం సముద్ర తీర ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తుందన్నారు. ఈ అధునాతన మెరైన్ బోట్లు 40 నుండి 50 కిలోమీటర్ల స్పీడ్ తో ప్రయాణించే విధంగా ఉంటాయన్నారు.




అదేవిధంగా గతంలో కేంద్ర ప్రభుత్వం అందజేసిన బోట్లను రిపేర్లు చేయించేందుకు ఇప్పటికే ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు అందచేశామన్నారు. అదేవిధంగా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ను రాబోయే కొద్ది రోజుల్లో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మౌలిక వసతుల నిర్వహణ గురించి గ్రామస్తులు, స్థానికులతో మాట్లాడతామన్నారు. పరిశ్రమలు ఏర్పాటు కావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాబోయే 30 సంవత్సరాల అవసరాల గురించి ఆలోచించి నిర్ణయం తీసుకుంటామన్నారు. మత్స్యకారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అలాగే పులికాట్ సరస్సు పూడికతీత పనులు కోసం శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ముఖ్యమంత్రికి అందజేసిన ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ పి సౌజన్య, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ శాంతి, ఇతరులు పాల్గొన్నారు.

## నెల్లూరులో బాబు జగజీవన్ రామ్ భవనం ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి..!

-దళిత నాయకులకు సన్మానం : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరులో బాబు జగజీవన్ రామ్ భవన్ ఏర్పాటుకు సంబంధిత రెవెన్యూ శాఖ ఇంజనీర్లతో కలిసి స్థల సేకరణ, అంచనా వ్యయంతో ప్రణాళికలు సిద్ధం చేయాల్సిందిగా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిని శోభారాణికి అదేశాలు జారీ చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఆదివారం స్థానిక కస్తూరిబా కళాక్షేత్రంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాబు జగజ్జివన్ రావు 118 వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన, బాబు జగజీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళీలర్పించిన అనంతరం పిల్లలు చేత జిల్లా కలెక్టర్ కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు జగజ్జీవన్ రామ్ మహానేత, దేశ సేవకుడని, అంకితభవన్తో పనిచేశారని ఆయన ఆశయాలకు అనుగుణంగా నేటి యువత ఆచరణీయంగా తీసుకోవాలన్నారు. బాబు జగజీవన్ రామ్ దార్శనికత పరిపాలనదక్షిత స్వాగతించ తగినదని ఆయన అన్నారు. అతిపిన్న వయసులోనే వివిధ శాఖలలో పనిచేసే దేశ అభ్యున్నతికి పని చేశారన్నారు. ఉప ప్రధానిగా ప్రతిభ కనపరిచి అమూల్య సేవలు అందించారని అంతేకాకుండా మంత్రిగా కూడా సేవలు అందించారన్నారు. సత్యాగ్రహ ఉద్యమంలో గాంధీతో కలిసి పోరాడరని లాటికి దెబ్బలు తిన్నారని అన్నారు. పండిట్ జవహర్లాల్ నెహ్రూ ,ఇందిరాగాంధీ మొరార్జీ దేశాయ్ ,వారి హయాంలో కీలక పదవులు పోషించారని. ఆయన ఆశయాలకు అనుగుణంగా నేటి యువత ముందుకు సాగాలని అభిలాషించారు. విద్యార్థిని విద్యార్థులు ఆరో తరగతి నుండి 12వ తరగతి లోపల లక్ష్యాన్ని నిర్దేశించుకుని తదనగుణంగా కష్టపడి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన తెలిపారు. చదువుతోనే ఉన్నత స్థితి వస్తుందని పేర్కొన్నారు. విద్యార్థిని విద్యార్థులకు లక్ష్యం ముఖ్యమన్నారు. తాను ఐదు సంవత్సరాలు విదేశాలలో ఉద్యోగం చేస్తూ దేశ సేవ చేయాలని దృక్పథంతో సివిల్స్ పరీక్షలకు సన్నద్ధం అయ్యానని ఆయన తెలిపారు. కేవలం సాంకేతికతను ఉపయోగించుకొని యూట్యూబ్ ద్వారానే శిక్షణను పొందానని నేటి విద్యార్థిని విద్యార్థులు యూట్యూబ్ ద్వారా విజ్ఞాన్నే పెంచుకోవాలి తప్ప దానిని నిరుపయోగంగా ఉపయోగించకూడదన్నారు. ఆన్లైన్ ద్వారా ఈరోజు అన్ని రకాల మెటీరియల్ అందుబాటులో ఉ



న్నాయన్నారు. ఒకప్పటి పరిస్థితి ఈరోజు లేదన్నారు. జిల్లాలోని హాస్టల్లో అభివృద్ధికి ఒక ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకునే విధంగా ఎస్ఓపి ఏర్పాటు చేయడం జరిగిందని, తద్వారా ప్రతి హాస్టలను అన్ని వసతులతో ఫైవ్ స్టార్ హాస్టల్స్ లాగా ఏర్పాటు చేయడమే తన లక్ష్యమన్నారు. నెల్లూరు జిల్లా పరిశ్రమల హబ్ గా ఏర్పాటు చేసే విధంగా నెలకు ఒక పరిశ్రమను తీసుకొచ్చే విధంగా రానున్న రెండు సంవత్సరాలకు ప్రణాళికలు ఏర్పాటు చేయడం జరిగిందని తద్వారా జిల్లాలో డిగ్రీ అర్హత పొందిన వారందరికీ జిల్లాలోని ఉపాధి అవకాశం కలుగుతుందన్నారు. రానున్న రెండు సంవత్సరాలలో వీలైనన్ని పరిశ్రమలు జిల్లాకు తేవడమే తన ముందున్న తక్షణ కర్తవ్యం అన్నారు. అందరి భాగస్వామ్యంతో హాస్టల్స్ పై సర్వే నిర్వహించి అవసరమైన పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఉదయగిరి, దుత్తలూరు ప్రాంతంలో రెండు మెగా పరిశ్రమలు రానున్నాయని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా ప్రైవేటు ఉద్యోగాల సైతం ఎక్కువగా ఏర్పడనున్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్, సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పందింటి సుబ్బయ్య మాదిగ, కలివేల ఎలీషా కుమార్, కుడుముల సుబ్బారావు, మన్నేపల్లి దాసు, ఆరుమళ్ళ మురళి, దేగ రాఘవేంద్రరావు, కే.సి. పెంచలయ్య, ఈపూరు వెంకటేశ్వరరావు, తాడిపర్తి పెంచలయ్య, గొల్లపల్లి శ్రీనివాసులు బాల చెన్నయ్య తదితరులు బాబు జగజీవన్ రామ్ ఆశయాలను జీవిత చరిత్రను అర్థమయ్యేలా వివరించారు....

## డా. బాబు జగ్జీవన్ రామ్ గారి 119వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించినఅడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సౌజన్య

**విజ్ఞాన్ దినపత్రిక టౌన్ రిపోర్టర్:** డా. బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) శ్రీమతి జి.ఎ. సౌజన్య పోలీసు అధికారులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్.పి.అడ్మిన్ మాట్లాడుతూ, బాబూజీ సామాజిక న్యాయం, సమానత్వం కోసం కృషి చేసిన మహానేతగా నిలిచారని, అట్టడుగు వర్గాల అభివృద్ధి, కార్మిక హక్కులు, వ్యవసాయ రంగ పురోగతికి విశేష సేవలందించారని తెలిపారు. ఆయన ఆదర్శాలను అనుసరించి సమసమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ూా= ఋూా చంద్ర మోహన్ , అడ్మిన్ ఆర్ఐ హరిబాబు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Bulidings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buildings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.